



పోలీసులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు, దళిత సంఘాల నాయకులు

జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం...

సంక్షేమంతో పాటు రాష్ట్ర పునర్‌నిర్మాణ పాలన చేస్తున్నాం
పెద్దన్నవారిపల్లి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
కదిరి నియోజకవర్గానికి వరాల జల్లు



ప్రజావేదికలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- కదిరి టౌన్, తలుపుల, కదిరి అర్బన్

శ్రీసత్యసాయి జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 'పేదల సేవలో' భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం పర్యటించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులను స్వయంగా కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. రెడ్డెమ్మకు వితంతు, హార్మోనిస్టు మల్లయ్యకు కళాకారుల పింఛను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న గంగుళమ్మను పరామర్శించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో మాట్లాడారు. పేదల ఆర్థిక సంక్షేమానికి తోడ్పాటునిస్తూ సామాజిక పింఛన్లను ప్రతి నెలా 1వ తేదీన లబ్ధిదారుల తలుపుతట్టి అందజేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లా ప్రజలనూ కలుసుకోవాలన్న ఉద్దేశంతో ప్రతి నెలా ప్రజల వద్దకు వస్తున్నామని అన్నారు. మొంథా తుపానును సాంకేతిక సాయంతో ముందస్తుగా గుర్తించి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశామన్నారు. అందువల్లే నష్ట తీవ్రత తగ్గిందన్నారు. తుపాను వల్ల రూ.5,244 కోట్ల ఆస్తి నష్టం రాష్ట్రంలో జరిగిందని, ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. తుపాను వల్ల నష్టపోయిన ప్రతీ ఒక్కరినీ ఆదుకునేందుకు ప్రయత్నిస్తున్నామని తెలియజేశారు. ఇప్పటికే తుపాన్ నష్టాన్ని అంచనా వేసి కేంద్రానికి నివేదికలు అందజేశామని చెప్పారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం పి4 విధానం అమలు చేస్తున్నామని అందులో భాగంగా ప్రభుత్వం సర్వే ద్వారా పేదలను గుర్తించి వారికి ప్రభుత్వం తరపున ఆర్థికంగా సామాజికంగా భరోసా కల్పించడంతోపాటు ఆదాయం పెంచేలా కృషి చేస్తున్నామని చెప్పారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు రాబోయేది ఐటీ విప్లవని ముందే చెప్పానని చెప్పిన మాట ప్రకారం లక్ష్యాన్ని చేరుకోగలిగామని ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో ఎక్కడ చూసినా తెలుగువారు ఐటీ కంపెనీల్లో స్థిరపడ్డారని అన్నారు. వైసిపి ఏదో రకంగా రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. నూతన టెక్నాలజీ ద్వారా అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకుంటున్నామనిగతంలో లాగా వైసిపి నేతల ఆగడాలు సాగవని నూతన టెక్నాలజీ ద్వారా గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజావేదిక కార్యక్రమం ప్రారంభంలో శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఘటనలో 9 మంది మృతికి సంతాప సూచకంగా సిఎంతో పాటు, నాయకులు, ప్రజలు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కదిరికి వరాల జల్లు : కదిరి ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరాలజల్లు కురిపించారు. కదిరి పట్టణంలో అడిషనల్ జిల్లా కోర్టు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థాన మాడవీధులను అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఏడు కోట్ల రూపాయలతో మైనార్టీ ప్రెసిడెంట్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు కోసం ఏడు కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నామని సిఎం ప్రకటించారు.

కదిరి పరువు తీసిన జగన్ : ఎమ్మెల్యే కందికుంట

ప్రజావేదికలో కదిరి ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలకు దిగారు. జగన్మోహన్ రెడ్డి కదిరి నియోజకవర్గ ప్రజల పరువును మంటలో కలిపారన్నారు. జగన్ బాబాయ్ వివేకానందరెడ్డి హత్యకేసులో కదిరి నుంచి గొడ్డలి తీసుకెళ్లి కదిరి సార్ అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మాట అనగానే సభా సమావేశంలో భారీ ఎత్తున ప్రజలు కేరింతలు వేశారు. పేదల సేవలో ప్రజా వేదిక కార్యక్రమానికి అధ్యక్ష వహించిన కదిరి పరువు తీశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబునాయుడు కదిరి అభివృద్ధికి ఎంతో చేయూతను అందజేస్తున్నారని అందుకు నియోజవర్గ ప్రజలు, తాము ఎంతో రుణపడి ఉన్నామని అన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో కదిరి నియోజకవర్గం ఆధ్యాత్మిక టూరిజంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆర్థికంగా మెరుగుపరిచే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కదిరి అభివృద్ధికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అభ్యర్థించిన అంశాలన్నిటిని పరిశీలించి పూర్తి చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రికి ఘనస్వాగతం :

తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ లో భాగంగా శనివారం మధ్యాహ్నం 12.47 గంటలకు పెద్దన్నవారిపల్లె హెలిపాడ్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేరుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి హెలీప్యాడ్ వద్ద కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర బీసీ సంక్షేమ, జిల్లా మంత్రి సవిత, హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అదే విధంగాకలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, జేసి మౌర్య భరద్వాజ్, ఆర్డీవోలు వివిఎస్ శర్మ, సువర్ణ ఆనంద కుమార్, మహేష్, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, కదిరి, మడకశిర మాజీ ఎమ్మెల్యేలు పార్థసారథి, ఈరన్న, కూటమి నాయకులు భైరవప్రసాద్, వంశీ, అంజనప్ప నియోజకవర్గ టిడిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. సిఎం పర్యటనా కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,ఆర్టీసీ చైర్మన్ నాగరాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.





రెడ్డమ్మకు వితంతు పింఛను అందజేస్తున్న సిఎం



వృద్ధురాలితో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు



ప్రజావేదికలో మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట

అంత్యక్రియలకు 'దారి' కష్టాలు..!

శ్మశానవాటికకు వెళ్లేందుకు రహదారి కరువు
మృతదేహంతో రోజంతా కొర్లకుంట ఎస్సీ కాలనీ వాసుల ఆందోళన

ప్రజాశక్తి-చిలమత్తూరు

శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కొర్లకుంట గ్రామ ఎస్సీ కాలనీ వాసులు చాలా ఏళ్లుగా శ్మశానవాటికకు దారి లేక ఇబ్బంది పడుతున్నారు. శ్మశానవాటికకు వెళ్లేందుకు రహదారి లేకపోవడంతో కాలనీవాసులు ఎవరు చనిపోయినా ఖననం చేసేందుకు అవస్థలు ఎదురవుతున్నాయి. శనివారం నాడు కాలనీకి చెందిన ఓ మహిళ మరణించగా శ్మశానవాటికకు వెళ్లేందుకు దారిలేకపోవడంతో సాయంత్రం వరకు మృతదేహాన్ని ఇంటి వద్దనే ఉంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దారిసమస్యను దళితకాలనీవాసులు పలుమార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అయినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. అధికారుల తీరును నిరసిస్తూ సిపిఎం, దళిత సంఘాల ఆధ్వర్యంలో కాలనీవాసులు శనివారం నాడు మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

మృతదేహంతో ధర్నా

చిలమత్తూరు మండలం దేమకేతపల్లి పంచాయతీ కొర్లకుంట ఎస్సీ కాలనీకి చెందిన గంగేశమ్మ(65) శనివారం మరణించింది. శ్మశానవాటిక దారి లేకపోవడంతో మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఏమి చేయాలో తెలియక మృతదేహాన్ని రోజంతా ఇంటి వద్దనే కుటుంబ సభ్యులు ఉంచుకున్నారు. శ్మశానవాటికకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో కొర్లకుంట ఎస్సీ కాలనీ వాసులు గంగేశమ్మ మృతదేహంతో ఆందోళన చేపట్టారు. కాలనీసమీపంలోని ప్రధాన రోడ్డుపై బైటాయించి ఆందోళన కొనసాగించారు. వీరి ఆందోళనకు సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్‌తో పాటు దళిత సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. పలుమార్లు తహసీల్దార్ కార్యాలయానికి వినతిపత్రాలు సమర్పించినా అధికారులు దారి సమస్యను పరిష్కరించాలేదంటూ దళితులు నాయకుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన సమాచారం అందుకున్న సిఐ రాజగోపాల్ నాయుడు, ఎస్ఐ మునీర్ అహ్మద్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. అక్కడి నుంచే జాయింట్ కలెక్టర్‌కు ఫోన్ చేయించి కాలనీవాసులతో మాట్లాడించారు. సోమవారం నాడు అధికారులు గ్రామంలో పర్యటించి శ్మశానవాటిక దారి సమస్యను పరిష్కరిస్తారని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆయన హామీతో దళితులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గంగరాజు, నరేంద్ర, గోపాల్ కృష్ణ, నరసింహమూర్తి, గోపాల్, రామాంజీ, పెద్ద తిపన్న, జగన్నాథ్, నరేష్, వేణు, లక్ష్మీపతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

విలేకరిపై దాడి దుర్మార్గం

సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా వార్త కోసం వెళ్లిన విలేకరిపై దాడి దుర్మార్గమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. పరిగి మండలం పి నరసాపురం గ్రామంలో ప్రజాశక్తి విలేకరిపై దాడికి పాల్పడిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పిల్లలకు క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు ఒక విలేకరి పట్ల రౌడీల్లా వ్యవహరించడం కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులు పిల్లలను ఎండలో కూర్చోబెట్టి వారు మాత్రం అంగన్వాడీ భవనంలో ఉండడాన్ని గమనించిన విలేకరి తన ఫోన్లో ఫోటోలు తీయడంతో అది గమనించిన ఉపాధ్యాయులు విచక్షణ కోల్పోయి విలేకరిపై దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులపై ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి ఎల్ నరసింహులు, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు హరి

ప్రజాశక్తి-పెనుకొండ

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్నిప్రభుత్వం వెనక్కి. తీసుకోవాలని ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయాలని రైతుసంఘం జిల్లా నాయకులు హరి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాయలసీమ అభివద్ధి వేదిక ఆధ్వర్యంలో పుస్తకాన్ని విడుదల చేశారు. ఈసందర్భంగా హరితో పాటు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బాబావలి మాట్లాడుతూ పెనుకొండ మెడికల్ కాలేజీ తో పాటు రాష్ట్రంలో పది కాలేజీలను పిపిపి ద్వారా ప్రైవేట్ పరం చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తిరోగమన చర్య అని అన్నారు. వైద్యవిద్యలో ప్రభుత్వ రంగానికి ప్రైవేట్ రంగం ప్రత్యామ్నాయం కాలేదన్నారు. యాజమాన్య నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వమే ప్రత్యక్షంగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రకారం ప్రజలకు ఆరోగ్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకట్రాముడు, సిఐటియు నాయకులు నరసింహ, హబీబ్, ఆటో యూనియన్ తిప్పన్న, నాగప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రావణ్, మనోహర్, ఇంతియాజ్, రాము తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అర్హులందరికీ పక్కాగృహాలు

మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

అర్హులందరికీ త్వరలో పక్కా గృహాలు మంజూరు చేస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటిని నెరవేరుస్తున్నామని మంత్రి తెలిపారు. శనివారం మున్సిపాలిటీ కేంద్రంలోని ఉప్పర వాడలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అధికారులు, నాయకులతో కలసి మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఉప్పరవాడలో రూ.15 లక్షలతో చేపడుతున్న సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీన రాష్ట్రంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పండగ చేసుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడ్డామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సతీష్ కుమార్, తహశీల్దార్ స్వాతి, మండల పట్టణ కన్వీనర్లు ఈశ్వర్ ప్రసాద్, శ్రీరాములు యాదవ్, రఘువీరా చౌదరి, త్రివేంద్ర నాయుడు, బాబుల్ రెడ్డి, షమీ, షౌకత్, కృష్ణమూర్తి, ఎనుముల రామకృష్ణ, అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

నిర్బంధాలను ఎదుర్కొంటూ..కార్మికులకు అండగా నిలుస్తూ..



పట్టణంలోని రహమత్‌పురం సర్కిల్‌లో తోరణాలు కడుతున్న నాయకులు

నేడు, రేపు 'పురం'లో సిఐటియు 10వ జిల్లా మహాసభ
హాజరుకానున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు
ఎర్రజెండాలతో రెపరెపలాడుతున్న హిందూపురం పట్టణం

ప్రజాశక్తి-హిందూపురం

కార్మికులకు అండగా.... శ్రమజీవులకు శక్తిగా... చిరుద్యోగుల గుండె చప్పుడుగా అనేక పోరాటాలు, ఎన్నో విజయాలు, మరెన్నో ప్రగతిశీల లక్ష్యాలతో ముందుకు సాగుతున్న సిఐటియు మరో అడుగు ముందుకు వేస్తోంది. ఓవైపు పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల శ్రమదోపిడీ, ఉద్యోగులపై వేధింపులు పెరుగుతుండగా, మరోవైపు ఎర్రజెండా నీడలో సిఐటియు ఆధ్వర్యాన జిల్లాలో పోరాటాలు ఉధృతంగా సాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఈ నెల 2, 3వ తేదీల్లో (ఆది, సోమవారాల్లో) సిఐటియు జిల్లా 10వ మహాసభలకు హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ భవన్ వేదిక కానుంది. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కల్లూరు సుబ్బరావు పార్కు నుంచి వేలాది మంది కార్మికులు ప్రదర్శన నిర్వహించనున్నారు. బీపీఎల్ షోరూం వద్ద బహిరంగసభను ఏర్పాటు చేయనున్నారు. ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎ.వి.ఎన్ నాగేశ్వరరావు, సి.హెచ్. నరసింగరావుతో పాటు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు ఇతర నాయకులు ప్రసంగించనున్నారు. ఈనేపథ్యంలో బహిరంగ సభ, ప్రతినిధుల సభ జరగబోయే ప్రదేశాలు సిఐటియు జెండాలతో ఎర్రబారాయి. కార్మికుల హడావుడి, ఎర్రజెండాల తోరణాలతో హిందూపురం పట్టణంలో కార్మికవర్గంలో పండగ వాతావరణం నెలకొంది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ నాయకత్వంలో మహాసభకు ఏర్పాట్లు చేస్తున్నారు. గడిచిన మూడేళ్లకాలంలో జిల్లాలోని సంఘటితర, అసంఘటితరంగ కార్మికులు, చిరుద్యోగులు, స్కీమ్ వర్కర్లు తదితరులు గడ్డుపరిస్థితులు ఎదుర్కొన్నారు. అదే స్థాయిలో సిఐటియు నాయకత్వంలో కార్మికులు పెద్దఎత్తున ఉద్యమించారు. కొత్తగా పరిశ్రమలు రాలేదుగానీ జిల్లాలోని చాలా వరకు పరిశ్రమలు మూతపడ్డాయి. జిల్లా పారిశ్రామిక అభివృద్ధి కూడా మందగించింది. మరోవైపు ప్రభుత్వం అవలంభిస్తున్న మోసపూరిత విధానం వల్ల ఉద్యోగ భద్రత, పనికి తగ్గ వేతనం లేదు. పని ఒత్తిడి ఎక్కువైంది. ఈనేపథ్యంలో ప్రభుత్వ శాఖలు, సంస్థల్లోని కాంట్రాక్టు, ప్రైవేటు ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు తమకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాడారు. ముఖ్యంగా అంగన్వాడీల 42రోజుల సమ్మె, సమగ్ర శిక్షా ఉద్యోగుల 22రోజుల సమ్మె, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు 16 రోజుల సమ్మె, ఆశా, విఆర్ఎ, మధ్యాహ్న భోజనం, భవన నిర్మాణ కార్మికులు, స్కూల్ ఆయాలు, మెడికల్ రిప్స్, ఆర్‌టిసి, హెల్త్ సెక్రటరీలు, 108, 104 ఫీల్డ్ అసిస్టెంట్స్, పెన్షనర్స్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పెద్దఎత్తున కదిలారు. వీరందరికీ సిఐటియు అండగా నిలుస్తూ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేసింది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవల్ల జరుగుతున్న కష్టనష్టాలను కార్మికవర్గానికి వివరిస్తూ, చైతన్య పరుస్తూనే సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను తీవ్రతరం చేసింది.

సిఐటియు ముఖ్యమైన పోరాటాలు-ఫలితాలు

అంగన్వాడీలు 42 రోజుల సమ్మె కాలంలో 32చోట్ల శిబిరాలు నడిచాయి. ధర్నాలు, రాస్తారోకో వంటి ఆందోళనలు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇంటితో పాటు మంత్రుల ఇళ్లముట్టడి కార్యక్రమాలకు కూడా వెనుకాడలేదు. ఫలితంగా 60ఏళ్ల రిటైర్‌మెంట్ వయసును ప్రభుత్వం 62ఏళ్లకు పెంచింది. ఉద్యోగ విరమణ సందర్భంగా వర్కర్లకు రూ.1.50లక్షలు, ఆయాలకు రూ.50వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మినీసెంటర్లు మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు వర్కర్లకు ప్రమోషన్ కల్పించేందుకు ప్రభుత్వం దిగివచ్చింది. ముఖ్యంగా చెన్నకొత్తపల్లి ప్రాజెక్టు, ఓడిసి ప్రాజెక్టు, పుట్టపర్తి ప్రాజెక్టు, ధర్మవరం ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్‌ను రాజకీయ కక్షసాధింపులతో తొలగింపునకు వ్యతిరేకంగా చేసిన పోరాటానికి అధికార యంత్రాంగం దిగిరాక తప్ప లేదు. ఆశా వర్కర్లు సిఐటియు అండతో వివిధ సమస్యలపై డిఎం అండ్ హెచ్ఒ, కలెక్టర్ ఆఫీస్ వద్ద 48 గంటల పాటు వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. అదే విధంగా చలో విజయవాడ కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో ఆశా కార్యకర్తలు వేతనంతో కూడిన మెటర్నరీ సెలవుతో పాటు అనేక సమస్యలను పరిష్కరించుకున్నారు. సమాన పనికి సమాన వేతనం రెగ్యులర్ కోసం సర్వశిక్షాభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద 22 రోజుల పాటు సమ్మెతో పాటు నిరసనలు తెలిపారు. వంట వార్పు కార్యక్రమం, మంత్రి, ఎమ్మెల్యే ఇళ్ల ముట్టడితో పాటు కలెక్టరేట్ నుండి పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివెళ్లారు. వీరికి సిఐటియు వెన్నుదన్నుగా నిలబడింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు 16 రోజులు సమ్మె చేపట్టడంతో పాటు వివిధ రూపాలుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చి వేతనాలు పెంచడంతో సమ్మె కాలపు వేతనాలను సాధించడంలో విజయం సాధించారు. దీంతో హిందూపురం పురపాలక సంఘంలో ఆప్కస్ కార్మికులు మృతి, విశ్రాంతి పొందిన కార్మిక కుటుంబాల్లో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్లతో చేసిన ఆందోళన కార్యక్రమాలకు పాలకులు, అధికారులు దిగి వచ్చి అందరికి ఉద్యోగాలు ఇచ్చారు. వీరితో పాటు చిలమత్తూరు మండలంలో గార్మెంట్స్ పరిశ్రమల్లో విధులు మహిళా కార్మికుల సమస్యలపై రాజీ లేని పోరాటాలతో వారి సమస్యలను పరిష్కరించడంలో అగ్ర స్థానం నిలచింది. ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేసిన ఆందోళన కార్యక్రమాలకు సిఐటియూ పూర్తి మద్దతు ఇచ్చి వారికి అండగా నిలబడింది. శ్రీరామి రెడ్డి, శ్రీ సత్య సాయి వాటర్ వర్స్ కార్మికుల సమస్యల పరిష్కారం, పెండింగ్ వేతనాలను చెల్లించాలని కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేశారు. దీంతో ప్రభుత్వం దిగి వచ్చి వారి సమస్యలను పరిష్కరించింది. జిల్లా వ్యాప్తంగా మేజర్ పంచాయతీల్లో వేతనాలు పెంచాలని, బకాయి వేతనాలు చెల్లించాలని కార్మికులు 26 రోజుల వరకు వివిధ పంచాయతీల్లో సమ్మె జరిగింది.

అమలుకు నోచని ప్లాస్టిక్ నిషేధం..



పట్టణంలోని ధర్మపురం వద్ద చెత్త కుండి వద్ద వేసిన ప్లాస్టిక్ కవర్లు

జిల్లాలో విచ్చలవిడిగా వినియోగం పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్లాస్టిక్ నిషేధంపై కేంద్రం ప్రభుత్వ ఆదేశాలను హిందూపురం పురపాలక సంఘంతో పాటు జిల్లా వ్యాప్తంగాకఠినంగా అమలు చేయాల్సిన అధికారులు, సచివాలయ శానిటేషన్ సెక్రేటరీలు కల్ప తరువుగా మార్చుకుంటున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల్ని ఎక్కడ అమ్మకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఎక్కడ పడితే అక్కడ యథేచ్ఛగా నిషేధించిన ప్లాస్టిక్ కవర్లను విచ్చల విడిగా వాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అమ్మకాలు జరిపుతూ పట్టుబడితే వారి కమర్షియల్ లైసెన్సులను రద్దు చేసే అవకాశం ఉంది. 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉండే ప్లాస్టిక్ సంచులను సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌గా పరిగణిస్తారు. అంటే రోజూ మనం వాడి పారేసే స్ట్రాలు, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ సంచులు, సోడా బాటిళ్లు, ప్లేట్లు, కప్పులు, ఆహారం ప్యాకేజీ కంటెయినర్లు, ఇయర్ బడ్ విత్ ప్లాస్టిక్ స్టిక్స్, సిగిరెట్ ఫిల్టర్స్ లాలీపాప్, చాక్లెట్లకు వాడే ప్లాస్టిక్ పుల్లలు, ఐస్‌క్రీమ్ స్టిక్స్, థర్మో కోల్, 100 మైక్రాన్ల లోపు మందం గల పివిసి బ్యానర్లు, ప్లాస్టిక్ ఇన్వి టేషన్ కార్డులు తదితర 16 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై కేంద్ర నిషేధించింది. అయినప్పటికి గ్రామ స్థాయి నుంచి పట్టణ, నగర స్థాయి వరకు ఎక్కడ నిషేదాన్ని అమలు చేయడం లేదు. ఇది చాలదన్నట్లు పట్టణంలో కొంత మంది ఇడ్లీ చేసే సమయంలో సైతం ప్లాస్టిక్ పేపర్ వాడుతున్నారు. హోటళ్లలో సైతం కూరలు, టీ పార్సీల్ సైతం ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. ఇది తెలిసినప్పటికి మున్సిపల్, ఆహార భద్రత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ప్లాస్టిక్ భూతం

స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ ఆంధ్ర వంటి కార్యక్రమాలు జిల్లాలో నగరాలు, మున్సిపాలిటీల్లో అమలవుతున్నా విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో అన్ని పంచాయతీల్లో రోజుకి సుమారు 11 టన్నులకు, పట్టణాలు, నగరాల్లో అయితే దాదాపు 60 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి జరుగుతుంది. దాంతో ప్రజారోగ్యం దెబ్బతింటుంది. హిందూపురం పురపాలక సంఘంలో 38వార్డుల్లో సుమారు 1. 90 లక్షల మంది జనాభా ఉండగా ఇక్కడ అనేక మంది వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లలో చెత్తను నింపి రోడ్లపై వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్‌ను ఎక్కువగా వాడుతున్నారు. పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ దాదాపు 2 లక్షలకుపైగా ప్లాస్టిక్ కవర్లు, ఇతర నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు ఒక రోజులో వినియోగమయ్యే అవకాశం ఉంది. ఇవన్నీ మరుసటి రోజుకు చెత్తగా మారి డ్రెయినేజీల్లోకి చేరి కాలుష్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. అధికారులు మూడేళ్ల క్రితం తనిఖీలు చేసి పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. అంతే అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్లాస్టిక్ నిషేదం ఉందన్న విషయాన్ని సైతం అధికారులు మరచి పోయారు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986లో భాగంగా ప్లాస్టిక్ ఉత్పత్తులు, వినియోగంపై జిల్లాలో పలు చోట్ల నిషేధాజ్ఞల చట్టాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అధికారులు కొంత కాలం పాటు అవగాహన కల్పించారు. అమ్మకాలపై మొదట్లో కొరడా ఝుళిపించారు. ఆ తర్వాత నిషేధంపై అధికారులు అంతగా పట్టించుకోకుండా వదిలేశారనే విమర్శలున్నాయి. ప్లాస్టిక్ నిషేధం ప్రకటనలు, ప్రచారానికి మాత్రమే పరిమితమైనట్లు కనిపిస్తుంది. ఎక్కడికక్కడ యథేచ్ఛగా ప్లాస్టిక్ సంచులను అమ్మకాలు జరుపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న వ్యాపారులకు భారీగా జరిమానా విధించడానికి సైతం వెనుకాడమని, వరుసగా రెండు సార్లు పట్టుబడిన దుకాణాలను సీజ్ చేస్తామని కూడా చెప్పుకొస్తున్నారు. కానీ ఆచరణలో అనేక చోట్ల ప్లాస్టిక్ వినియోగం యథావిధిగా జరిగిపోతుంది. కానీ అధికారుల చర్యలు ఎక్కడా కానరావడం లేదు.

పట్టణంలో మితిమీరిన ప్లాస్టిక్ వినియోగం : హిందూపురం పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం ప్రస్తుతం హద్దులు దాటింది. బహిరంగ మార్కెట్లలో ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు మితిమీరి వినియోగిస్తున్నారు. వాటిని రోడ్లపై, కాలువల్లో పడేస్తుండటం వల్ల మురుగు కాలువల్లో మురుగు ముందుకు పోవడం లేదు. రోడ్లపై వ్యర్థాలను ప్లాస్టిక్ సంచుల్లో వేయడం వల్ల అవి తిని ఆవులు, పందులు, కుక్కల జీర్ణవ్యవస్థ పని చేయక మరణిస్తున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మరణించిన జీవాల్లో 90 శాతం ఇదే కారణంగా ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ తేల్చింది. పెట్రో కెమికల్ ద్వారా తయారయ్యే ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలు వేయడం వల్ల కార్సినోజెనిక్ అనే ఉత్పాదిక రసాయనం విడుదలై కేన్సర్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికి కొంత మంది ఇడ్లీ తయారిలో, టీ, కాఫీ పార్సిల్ లో సైతం దీనిని వినియోగిస్తున్నారు. భూమిలో వందేళ్లయినా కరగని ఏకైక వస్తువు ప్లాస్టిక్‌గా గుర్తించిన కొన్ని అధ్యయన సంస్థలు దీనిని పూర్తిగా నిషేధించాలని సూచిస్తున్నాయి.

నిషేధిత ప్లాస్టిక్ వాడకూడదు



భారత ప్రభుత్వం కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించింది. వాటిని పూర్తిగా వాడకూడదు. ఒక్కసారి వినియోగించే పడేసే కవర్లపైనే మా దృష్టంతా. బహిరంగ మార్కెట్లలో ప్లాస్టిక్ వినియోగంతో పాటు ఉత్పత్తిపైన నిఘా పెడుతున్నాం. ప్రజల సహకారం ముఖ్యం. పట్టణ వ్యాప్తంగా ఆకస్మిక దాడులకు బృందాలను ఏర్పాటు చేసి, దశలవారీగా వార్డు సచివాలయాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను చైతన్య వంతులను చేస్తాం. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం

మల్లికార్జున,
మున్సిపల్ కమిషనర్

రోడ్డు ప్రమాదంలో కర్నాటకవాసి మృతి

ప్రజాశక్తి - రొళ్ల

మండలంలోని రత్నగిరి సమీపంలో శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో కర్నాటక ప్రాంతానికి చెందిన గోవిందరాజులు (30) మృతిచెందాడు. రత్నగిరి నుంచిరోళ్ల కు వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న టివిఎస్ సూపర్ ఎక్సెల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు కర్నాటక రాష్ట్రం మధుగిరి తాలూకా కమ్మదల్లి గ్రామానికి చెందిన గోవిందరాజులు అక్కడక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండల పరిధిలోని గ్రామాలలో రాత్రిపూట రెక్కి నిర్వహించి, ఇంటి దొంగతనాలు పాల్పడే దొంగలను రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శనివారం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, ధర్మవరం సబ్ డివిజన్ డిఎస్పీ హేమంత్ కుమార్ ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ గౌడ్ పర్యవేక్షణలో కేసును చేదించడం జరిగిందన్నారు. ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పుట రెక్కి నిర్వహించి ఊరు చివరలలో వుండే దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడే గురునాథం అంజయ్య అలియాస్ ఆంజనేయులు, గురునాథం వెంకటేశ్వర్లును అరెస్ట్ చేశామన్నారు. నిందితులు అన్నమయ్య, ప్రకాశం జిల్లాకు చెందిన వారని చెప్పారు. వీరి వద్దనుండి మొత్తం 340 గ్రాముల వెండి, 3 గ్రాముల బంగారు స్వాధీనం చేసుకున్నామన్నారు.

జిల్లాలో 95.4 శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లావ్యాప్తంగా శనివారం 95.4 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తెలిపారు. మొత్తం జిల్లాలో 2,63,173 మందికి రూ.115.26 కోట్లు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. పింఛన్లు అందని వారికి సోమవారం పంపిణీ చేస్తామని చెప్పారు. పింఛన్ల పంపిణీలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దన్నవారిపల్లెలో పింఛన్లు పంపిణీలో పాల్గొనగా నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు అక్కడికి వెళ్లి ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో మంత్రులు

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో రాజీవ్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు మంత్రులు సవిత, అనగాని సత్య ప్రసాద్ శనివారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, నాయకులు జయచంద్ర, గోపాల్ రెడ్డి, రవి, మోహన్, ఉత్తమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర టౌన్ : మండల పరిధిలోని ఆముదాల గొంది పంచాయతీ ఎగువ రామగిరి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా ఫింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పంపిణీ చేశారు. పంచాయతీ నాయకులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ నాగరాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి - మడకశిర టౌన్

మడకశిర పట్టణంలోని చావిడి ప్రాంతంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి శనివారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా బలిజలు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ జవానుకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని చల్లా పల్లి గ్రామానికి చెందిన జవాన్ అనిల్ కుమార్ రెడ్డి 17 సంవత్సరాలుగా ఆర్మీలో పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని శనివారం సొంత గ్రామానికి వచ్చారు. దీంతో గ్రామంలోని పలువురు విద్యార్థులు, తోటి స్నేహితులు, మహిళలు ఆయనకు ఘనస్వాగతం పలికారుజ మేళతాళాలతో గ్రామానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జవాన్ మాట్లాడుతూ తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని 17 సంవత్సరాలు దేశ సేవ లో అంకితమై సొంత గ్రామానికి వచ్చానని చెప్పారు. గ్రామస్తులు తనమీద ఎంతో అభిమానం చూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సత్యనారాయణ రెడ్డి, గిడ్డారెడ్డి, సర్పంచి దామోదర్, జితేంద్ర రెడ్డి, గున్ని స్వామి, హరీష్ రెడ్డి, ముజీబ్, అజయ్ రెడ్డి, ప్రతాపరెడ్డి, రాజేష్ రెడ్డి, చల్లపల్లి ఈశ్వర, హనుమంతు, సతీష్ రెడ్డి, బాలచంద్ర, బాబు, కోతుల మూర్తి, పోతిరెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, అంజిరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యోగివేమన విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో రెడ్డి సామాజిక వర్గం ఆధ్వర్యంలో రెవిన్యూ కార్యాలయానికి వెళ్లే దారి పక్కన యోగివేమన విగ్రహ ఏర్పాటుకు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రెడ్డి సామాజికవర్గం వారు ర్యాలీ నిర్వహించారు అనంతరం ఎస్-ఎల్‌వి ఫంక్షన్ హాల్‌లో రెడ్డి కులస్తులు సమావేశం నిర్వహించారు యోగివేమన విగ్రహం పూర్తి చేయడానికి అందరూ సహకారం అందించాలని తీర్మానించారు.

కల్లు డిపోల్లో శాంపిళ్ల సేకరణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం, పరిగి మండలాల పరిధిలో కల్తీ కల్లు సేవించి దాదాపు 20 మంది దాకా అస్వస్థతకు గురైన ఘటనపై ఎక్సైజ్ అధికారులు చర్యలకు పూనుకున్నారు. ఇప్పటికే చౌళూరు ఘటనలో ఇద్దరిపై రూరల్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో హిందూపురం, లేపాక్షిలో ఉన్న కల్లు డిపోలను ఎక్సైజ్ సిబ్బంది పరిశీలించారు. ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య ఆధ్వర్యంలో పట్టణంతో పాటు, లేపాక్షి మండలం పులమతి గ్రామంలో ఉన్న కల్లు డిపోలలో శాంపిల్స్ సేకరించారు. వీటిని చిత్తూరు కెమికల్ ల్యాబ్కు పంపుతున్నట్లు సిఐ తెలిపారు. అలాగే కల్తీ కల్లు అరికట్టేలా కల్లు అమ్మకదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి, కల్తీ కల్లు విక్రయదారుల మీద పీడి యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే కల్లు తాగే వారికి అవగాహన కల్పించారు.కల్తీ కల్లు తయారు చేసిన, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పృథ్వి, ఫరూక్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుల్స్ నరసింహ,వెంకటేష్, రమణ,సతీష్, కానిస్టేబుల్స్ అంజి,రవీంద్ర, కుమార్, రంగదామా, శివ, సుధాకర్ రెడ్డి, ఉష్మాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు నాయకత్వ లక్షణాలు అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వంలో రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని రెనౌల్ట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు నాయకత్వంపై ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పిఎల్, ఏ ఎస్ పి ఎల్, వివిధ విభాగాలకు విద్యార్థులు పోటీలో నిలబడ్డారు. ఇందులో విద్యార్థులు వారికి కావలసిన వారిని ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే ఎన్నికల తరహాలోనే ఎన్నుకున్నారు. ఎంపికైన వారికి ఎంఈఓలు గంగప్ప, ప్రసన్న లక్ష్మి బ్యాడ్జిలను అందించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఐఐటి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ అందించి అభినందించారు. అనంతరం పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు ముస్తఫా అలీ ఖాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం నూతనంగా నాయకులుగా ఎంపిక అయిన వారి విధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బీబీ హాజీరా, ఉపాధ్యాయులు సర్ఫారాజ్ అలి ఖాన్, నాజనీన్, సాఖీబ్ ఖాన్, నాజీమ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా విద్యార్థులతో ఎంఇఒ, పాఠశాల అధ్యక్షులు ముస్తఫ ఆలీ ఖాన్ తదితరులు

రాయితీ సోలార్ రూఫ్‌టాప్‌తో ప్రయోజనం

ప్రజాశక్తి - రొద్దం

గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయించుకుని విద్యుత్ బిల్లు ఆదా చేసుకోవాలని ట్రాన్స్‌కో ఎఇ శ్రీనివాస్ మూర్తి, సోలార్ అధికారి లక్ష్మయ్య కోరారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోలార్ రూఫ్‌టాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు షేక్షావలి, రాజేష్, బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీ ఉషోదయ పాఠశాలలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ శంషాద్ బేగం హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ చాంద్ బాషా, ఇన్‌ఛార్జి బినోయ్ ఫ్రాన్సిస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొంతగూటికి వైబిహళ్లి ఎంపీటీసీ

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండల పరిధిలోని వైబిహళ్లి ఎంపీటీసీ రంగనాథ్ ఇటీవలే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు అయితే శనివారం తిరిగి రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, మడకశిర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త ఈరలకప్ప, రాష్ట్ర కుంచిటి వక్కలిగా విభాగం అధ్యక్షులు రంగే గౌడు, వైసిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశేఖర్ రెడ్డి సమక్షంలో మడకశిర పట్టణంలో వైసీపీ కండువా కప్పుకున్నారు.

చదువుతోనే సమాజంలో గౌరవం

ప్రజాశక్తి - కొత్తచెరువు

చదువుతోనే ప్రతి ఒక్కరికీ సమాజంలో సముచిత స్థానం దొరుకుతుందని. ఐసీడీఎస్ సూపర్ వైజర్ రజిత అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లలకు. భద్రత, గుర్తింపు ఒక్క చదువుతోనే సాధ్యమవుతుందని అన్నారు. అమ్మాయిలకు ఎంత చదివిస్తే అంత సమాజానికి మంచిదని అన్నారు. చదువు విషయంలో అమ్మాయిలు, అబ్బాయిలు అంటూ వివక్ష చూపొద్దని తల్లిదండ్రులను కోరారు. బాల్య వివాహాలు చేయకుండా అమ్మాయిలను చదువుపై దృష్టి సారించేలా తల్లిదండ్రులతో పాటు సమాజంలోని ప్రతి పౌరుడు చొరవ చూపాలని ఐసీపీఎస్ డీసీపీవో మహేష్ అన్నారు. పిల్లల హక్కులు,బాధ్యతలు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ గురించి హెచ్ ఎమ్ కె యస్ నంజుండప్ప వివరించారు కార్యక్రమంలో ఐసిడిఎస్ మురళీకృష్ణ, బండపల్లి ఉన్నత పాఠశాల నోడల్ టీచర్ కె శాంతి , మాణిక్యం ఇసాక్, భాస్కర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిసిపిఒ

'కూటమి'తోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -నల్లమాడ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జనసేన ఇన్ ఛార్జ్ పత్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని చారుపల్లి, బడావాండ్లపల్లి, రెడ్డిపల్లి, కొత్తపల్లి తండా, వేళ్లమద్ది, కొండకింద తండా గ్రామాల్లో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చామన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏపీని అప్పుల ఆంధ్రప్రదేశ్ గా మార్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు మైలే శివశంకర్, ఎల్ఐసి నరసింహులు, గడ్డం రమణారెడ్డి, సుధాకర్ రెడ్డి, రమణ రెడ్డి, కేశవ రెడ్డి, చిదంబరం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

కంది, మొక్కజొన్న పంటలను పరిశీలించిన మంత్రి

ప్రజాశక్తి - రొద్దం

మండల కేంద్రం సమీపంలో రైతులు సాగు చేసిన కంది మొక్కజొన్న పంటలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత శనివారం పరిశీలించారు. రైతు సిద్దన్న వేసిన కంది పంటను, కుర్లపల్లి గ్రామానికి చెందిన వీరచిన్నప్ప సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటసాగు, పెట్టుబడికి అయిన ఖర్చు, ప్రస్తుతం పంటపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం : మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త తలారి హనుమంతప్ప శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత శనివారం గ్రామానికి వెళ్లి హనుమంతప్ప మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం సుబ్బారాయప్ప గారి కొట్టాల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త లక్ష్మి నారాయణను పరామర్శించారు. అతని తండ్రి ఈనెల 27న ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో లక్ష్మినారాయణను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, చంద్రమౌళి, నరసింహులు, మంజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కందిపంటను పరిశీలిస్తున్న మంత్రి సవిత

రాష్ట్రాభివృద్ధికి తండ్రి, తనయుడి తపన

మున్సిపల్ ఛైర్మన్ డిఇ రమేష్‌బాబు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

గత ఐదేళ్ల వైసిపి పాలనలో భ్రష్టు పట్టిన రాష్ట్ర పాలనను గాడిలో పెట్టేందుకు ఓవైపు తండ్రి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మరోవైపు చంద్రబాబు నాయుడు తనయుడు, మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, టిడిపి నేతలు గ్రీన్ పార్క్ నాగరాజు, బేవినహళ్లి ఆనంద్ కుమార్ తదితరులు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో కషి చేస్తున్నారని అన్నారు. పారిశ్రామికవేత్తలకు రాష్ట్రంలో ఉన్న వనరుల గురించి అవగాహన కల్పించేందుకు ఇటీవల ముఖ్యమంత్రి దుబాయ్ లో పర్యటించగా మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియాలో పర్యటించారన్నారు. త్వరలో విశాఖపట్నంలో జరిగే సిఐఐ సదస్సుకు పెద్ద ఎత్తున పారిశ్రామికవేత్తలు తరలి రానున్నట్లు తెలిపారు. కేవలం చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు కృషితో విశాఖపట్నంలో గూగుల్ సెంటర్ రావడం ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో ఓ మైలురాయిగా చెప్పవచ్చని వ్యాఖ్యానించారు. వైసిపి హయాంలో అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా కూరుకుపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సిఎం కృషి చేస్తున్నారన్నారు. వైసిపి పాలనలో పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడి పెట్టాలంటే సంశయం వ్యక్తం చేసే వారిని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇక్కడి పరిస్థితులు, వనరులను వివరిస్తూ రాష్ట్ర అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని పారిశ్రామికవేత్తలను సిఎం కోరుతున్నట్టు తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వ పెద్దలు, ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తుంటే ఇది జీర్ణించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హిందూపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కషి చేస్తున్నారన్నారు. కేవలం హిందూపురం మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే రూ 92.50 కోట్లు విడుదల చేయించారన్నారు. ఆయా పనులకు ఇప్పటికే టెండర్లు పిలవడం జరిగిందని, త్వరలోనే పనులను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు షఫీవుల్లా, రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాటలు వక్రీకరించడం శోచనీయం

ప్రజాశక్తి-పెనుకొండ

మడకశిరలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సభలో ఎమ్మెల్యే ఎమ్.ఎస్ రాజు మాట్లాడిన మాటలను వక్రీకరించడం శోచనీయమని బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని ఎంక్యూ ఏ ట్రస్టు సమావేశ భవనం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ఆయన మాట్లాడిన మాటలు ఉన్న విడియోలను పరిశీలిస్తే నిజానిజాలు బహిర్గతమవుతాయని ఆయన వివరించారు. ఈ సమావేశంలో బహుజన చైతన్య వేదిక సభ్యులు రవికుమార్, రామాంజనేయులు, బాబు ప్రసాద్, ఆండ్రోస్, రామదాసు, నరసింహులు, శేఖర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.